10

*రూపాంతరపు జీవితము*
*పరిచర్య చేయు*
*జీవితమై యుంటుంది*

# యేసు తన శిష్యుల కాళ్లు కడిగినప్పుడు

## (యోహాను 13:1-17)

యేసు రాజైయున్నారు. రాజునుగూర్చి మనం తలంచినప్పుడు, ఒక మనుష్యుడు సింహాసనాసీనుడైయున్నట్టో, గుఱ్ఱంమీద స్వారి చేస్తున్నట్టో, జయించిన సైన్యానికి ముందు తన గుఱ్ఱం మీద కూర్చుండి సాగిపోతున్నట్టో, జనుల యెదుట తన రాజ వస్త్రములు, కిరీటము ధరించి కవాతు చేస్తున్నట్టో మనం ఆలోచన చేస్తుంటాం.

అయితే యోహాను 13లో మనం మన రాజును వ్యత్యాసంగా చూస్తాం: తువాలు కట్టుకొని, తన శిష్యుల పాదముల యొద్ద మోకాళ్లూని, అయన వారి పాదాలు కడుగు తున్నారు. “మేము యేసుని చూడగోరుచున్నాము” అని ఒకనాడు గ్రీసు దేశస్థులన్నారు (యోహాను 12:21). ఇక్కడ మనం ఏలాటి క్రీస్తును చూడగలం? పరిచర్యకు మాదిరిని చూపినవానిగా కన్పిస్తారు! ఈ సంఘటను గూర్చి మూడు ప్రశ్నలను అడుగుదాం.

### యేసు ఈ మాదిరిని ఎందుకిచ్చారు?

ఈ ప్రశ్నకు సాధ్యమయ్యే రెండు సరియైన జవాబులున్నాయి. వీటిలో ఒకటేమంటే, ఆ పంౘ్రెండు మందికి యేసు నేర్పించే పాఠం అవసరం. నిజమైన శిష్యుని గురుతు పరిచర్య చేయడమనేది వారింకను గుర్తించలేదు. ముందు జరిగిన సందర్భాల్లో, రాజ్యములో “ఎవరు మిక్కిలి గొప్పవారో అనే చర్యలు అపొస్తలుల మధ్య జరిగాయి. అప్పటిలో, మీలో ఎవడు ప్రముఖుడైయుండ గోరునో వాడు మీ దాసుడు [బానిస] అయ్యుండాలని” ప్రభువు వారికి తెలిపారు (మార్కు 10:35-45; మత్తయి 20:20-28). అప్పుడు వారు ఆ పాఠాన్ని నేర్చుకోలేదు. ఆఖరికి, చివరి రాత్రి భోజనంలో సహా రాజ్యంలో ఎవరు మిక్కిలి గొప్పవాడు అనే ప్రశ్నను చర్చించుకొంటున్నారు – ప్రభు రాత్రి భోజన స్థాపనం జరిగిన తరువాత, లూకా మన కిలా తెలిపాడు,

> తమలో ఎవడు గొప్పవాడుగా ఎంచబడునో అను వివాదము వారిలో పుట్టగా ఆయన వారితో ఇట్లనెను – అన్యజనములలో రాజులు వారిమీద ప్రభుత్వము చేయుదురు; వారి మీద అధికారము చేయువారు ఉపకారులనబడుదురు. మీరైతే

> ఆలాగు ఉండరాదు; మీలో గొప్పవాడు చిన్నవానివలెను, అధిపతి పరిచారకునివలెను ఉండవలెను. గొప్పవాడెవడు? భోజన పంక్తిని కూర్చుండువాడా పరిచర్య చేయువాడా? పంక్తిని కూర్చుండు వాడేగదా? అయినను నేను మీ మధ్య పరిచర్య చేయువానివలె ఉన్నాను (లూకా 22:24-27).

వారిలో ఎవడు మిక్కిలి గొప్పవాడో అనే వివాదమును వెంబడించి యేసు తన శిష్యుల పాదాలు కడగడం సంభవించి యుండవచ్చు: "నేను మీ మధ్య పరిచర్య చేయువానివలె ఉన్నాను" అనే మాటలు అప్పుడు పలికినవి.

అపొస్తలులు యేసుతో మూడు సంవత్సరాలు ఉన్న తరువాతకూడ, రాజ్యములో గొప్పవారెవరు అనే విషయం బోధించినా వారు దాన్ని గ్రహించలేదు సరిగదా, పరిచర్య చేయడమంటే కూడా వారు గ్రహించలేదు. వారిలో ఎవడు మిక్కిలి గొప్ప అపొస్తులుడై యుండ అర్హతగలవాడో వారింకను వాదించుకొంటునే ఉన్నారు. తాను ప్రముఖుడనని చెప్పుకొనడానికి ప్రతివానికి వాని సొంత వివాదము ఉండియుండవచ్చు.

పైగా, యేసు జీవితంలో ఒక విధమైన ఔన్నత్యము రానున్నట్టు వారు గుర్తించారు. ఆయన చనిపోబోతున్నట్టు ప్రభువు వారికి తెలిపారు; అది జరుగకముందే అధికారము మరియు ఘనతకు సంబంధించిన విషయములు తీర్మానానికి రావడం ప్రాముఖ్యమైనట్టుగా వారు భావించారు.

వారు యిప్పుడు ఒక ప్రాముఖ్యమైన భోజనం చేయడానికి వచ్చారు. దానికొరకనే ప్రత్యేకమైన సిద్ధపాటు జరిగింది. అయితే అక్కడ సేవకులెవరూ లేరు. సాధారణంగా, ఆలాటి భోజన సందర్భంలో దాసుడొకడు అతిథుల పాదాలు కడుగుతాడు లేదా అతిథులు తమ కాళ్లు కడుగుకొనడానికి నీళ్లు ఏర్పాటు చేస్తాడు. అపొస్తలులు దీనిని గమనించారు; వారు పాదాలు కడగడానికి ఏదో ఒక ఏర్పాటు జరుగుతుందని గుర్తించారనేది నిస్సందేహం. అయితే అది సేవకుని పని! వారిలో ఎవడైనా ఆ పని చేయడానికి తగ్గించుకున్నట్టయితే, ప్రాధాన్యతకు తన హక్కును విరమించుకొన్నట్టే, ఆ మేరకు తన్నుతాను తగ్గించుకొనడానికి ఎవరే యిష్టపడలేదు, సరిగదా మొదటి స్థానం కొరకైన వారి ఆశని వదులుకునే వారెవరూ లేరు. గనుక ఆ పని కేవలం జరుగకుండానే పోతుంది. ఇతరుల పాదాలు కడగడం వారిని అంచనా ప్రకారం తక్కువ వాడిగా అంగీకరించినట్టొంది. అపొస్తలులకు ఈలాటి పాఠం అవసరమైయుంటుంది!

యేసు ఈ మాదిరిని "ఎందుకు?" యిచ్చారనే ప్రశ్నకు మరొక జవాబుంది. అది కేవలం అపొస్తలులకు అవసరమైనందుననే కాదు, గాని ఆయన వారిని ప్రేమించినందున కూడా. ఈ విషయం యిలా పరిచయం చేయబడింది:

> తాను ఈ లోకమునుండి తండ్రియొద్దకు వెళ్లవలసిన గడియవచ్చెనని యేసు పస్కాపండుగకు ముందే యెరిగినవాడై, లోకములో ఉన్న తనవారిని ప్రేమించి, వారిని అంతమువరకు ప్రేమించెను (యోహాను 13:1).

ఆయన గడియ వచ్చినందున కూడా యేసు ఈ మాదిరిని యిచ్చారు. యోహాను యిలా

అంటున్నాడు:

> వారు భోజనము చేయుచుండగా ఆయనను అప్పగింపవలెనని సీమోను కుమారుడగు ఇస్కరియోతు యూదా హృదయములో అపవాది ఇంతకుముందు ఆలోచన పుట్టించి యుండెను గనుక తండ్రి తన చేతికి సమస్తము అప్పగించెననియు, తాను దేవునియొద్దనుండి బయలుదేరి వచ్చెననియు, దేవునియొద్దకు వెళ్లవలసియున్నదనియు యేసు ఎరిగి భోజన పంక్తిలోనుండి లేచి తన పై వస్త్రము అవతల పెట్టివేసి, యొక తువాలు తీసికొని నడుమునకు కట్టుకొనెను (యోహాను 13:2-4).

ఆలాటి సమయాలలో, మాటచేతగాని క్రియచేతగాని ఏ సందేశము ఆయన తన శిష్యులతో విడిచిపెట్టినా అది బహుగా ప్రాముఖ్యమైనదని తలంచాలి.

యేసు మృతి పొందనైయుండగా, ఆయన తన శిష్యులను ఆయన ప్రేమించుతున్నందున, ఆయన వెళ్లకముందు ఈలాటి అతిప్రాముఖ్యమైన పాఠం వారు నేర్చుకోవాలని ఆయన కోరాడు. ఆయన వారి పాదములు కడిగినప్పుడు, ఆయన వారికి ఈ పాఠాన్ని ఉపదేశించారు.

## ఆ మాదిరి శిష్యులనుండి ఏమి కోరుతుంది?

యోహాను 13:3-17లో ఈ కథను చదవడం వలన ఈ ప్రశ్నకు మనం జవాబుచెప్పనారంభిస్తాం.

తన మాదిరిని అనుసరించాలని యేసు తన శిష్యులకు నాలుగు సార్లు చెప్పారు: "మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే" (14 వచనం); "నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెను" (15 వచనం); "బానిస యాజమానుని కంటె అధికుడు కాడు" (16 వచనం). అంటే, ఆయనేమంటున్నారంటే, "నేను పరిచర్య చేస్తున్నట్టయితే, మరి మీరెంతగా పరిచర్య చేయడానికి యిష్టపడి దిగిపోవాలో?" "వీటిని చేసినయెడల మీరు ధన్యులగుదురు" (17 వచనం).

అయితే వారు ఈ మాదిరిని ఎలా అనుసరించాలి? యేసు శిష్యుల పాదములను కడుగుట వారి ఎదుట పెట్టిన మాదిరి ఎలాగైయుంటుంది?

సంఘంలో ఆచరించవలసిన ఆచారకర్మకాండగా యేసు ఈ మాదిరిని పెట్టినట్టు కొందరు నమ్ముతారు. నేటికిని కొన్ని సంఘాలవారు ఫలాని సందర్భాలలో ఆరాధనా కార్యక్రమములోని భాగంగా "పాదాలు కడగడాన్ని" ఆచరిస్తారు.

అయితే ప్రభువైన యేసు జరిగించిన ఆ కార్యం మతసంబంధమైన కర్మకాండకు సంబంధమైనది కాదు. పాదాలు కడగడమనేది ఆ నాటి కాలపు గృహాల్లో అలవాటు ప్రకారము జరుగు సంభవమైయుంది. దుమ్ము రోడ్లమీద చెప్పులతో నడిచివచ్చేవారి పాదాలు దుమ్ముచే కప్పబడి యుంటాయి. వాటిని కడగడం అవసరమైయుంటుంది. అట్టి పరిస్థితిలో, ఒక యింటికి నీవు [అతిథిగా] వెళ్లగానే, ప్రయాణానంతరం నీ కాళ్ళు కడగడం అలసట తీర్చబడినట్టుంది, లేక నీవు కూర్చున్నప్పుడు (లేక జారబడినప్పుడు) ఒక సేవకుడు వచ్చి నీ కాళ్లవద్ద కూర్చుండి వాటిని కడగడం సేదదీర్చబడినట్టుంటుంది.

దీనికి వ్యతిరేకంగా, ఆలాటి అవకాశం లేకపోతే, నీవు సందర్శించినంత సేపు ఆ యింట నీవు సౌకర్యం లేనట్టుగా ఫీలౌతూ ఉంటావు.

"యేసు తన శిష్యుల పాదాలు ఎందుకు కడిగారు?" అనే ప్రశ్నకు జవాబుగా, "వారి పాదాలు మురికిగా ఉన్నందున" అని చెప్పడంవలన దీన్ని వ్యక్తపరచవచ్చు. వారు కడుగబడే అవసరతలో ఉన్నారు!

అందువలన, బైబిల్లో, పాదములు కడగడమనేది పరిచర్యకును, ఆతిథ్యానికిని, సత్క్రియల సందర్భంలో జరిగిందే. మమ్రేలోని సింధూర వృక్షము క్రింద అబ్రహాము ఆ ముగ్గురు మనుష్యులకు ఆతిథ్యం చేశాడు, వారి కాళ్లు కడుగబడేలా చూచాడు (ఆదికాండము 18:4). సొదొమలో లోతు యెహోవా యొక్క వర్తమానికులను తన యింటికి ఆహ్వానించినప్పుడు, "... మీ దాసుని యింటికి వచ్చి రాత్రి వెళ్లబుచ్చి కాళ్లు కడుగుకొనుడి ..." (ఆదికాండము 19:2). అబ్రహాము యొక్క సేవకుని లాబాను తన యింటిలోనికి ఆహ్వానించినప్పుడు, "కాళ్లు కడుగు కొనుటకు అతనికిని అతనితో కూడ నున్నవారికిని నీళ్లు ఇచ్చి" (ఆదికాండము 24:32). రెండవమారు యోసేపు సహోదరులు ఐగుప్తునకు వచ్చినప్పుడు, యోసేపు వారికి "నీళ్లియ్యగా వారు తమ కాళ్లు కడుగు కొనిరి" (ఆదికాండము 43:24). గిబియాలోని ఒక వృద్ధుడు యిద్దరు మనుష్యులను తన యింట చేర్చుకొని ఆతిథ్యమిచ్చినప్పుడు, "వారు కాళ్లు కడుగుకొని అన్న పానములు పుచ్చుకొనిరి" (న్యాయాధిపతులు 19:21). దావీదు అబీగయీలును తనకు భార్యనుగా తెచ్చుటకు మనుష్యులను పంపగా, "నా యేలినవాని సేవకుల కాళ్లు కడుగుటకు నా యేలినవాని దాసురాలనగు నేను సిద్ధముగానున్నా"నని చెప్పింది (1 సమూవేలు 25:41). ఒక పరిసయ్యుని యింట యేసు భోజనంచేసినప్పుడు, "నేను నీ యింటిలోనికి రాగా నీవు నా పాదములకు నీళ్లియ్యలేదు" అని ఆయన అన్నారు (లూకా 7:44). ఏలాటి విధవరాలిని విధవరాలి క్రింద లెక్కించమన్నాడో చూడు: "సత్ క్రియలకు పేరు పొందిన విధవరాలు పిల్లలను పెంచి, పరదేశులకు ఆతిథ్యమిచ్చి, పరిశుద్ధుల పాదములు కడిగి, శ్రమపడు వారికి సహాయముచేసి, ప్రతి సత్కార్యము చేయ బూనికొనినదైతే ఆమెను విధవరాండ్ర లెక్కలో చేర్చవచ్చును" (1 తిమోతి 5:10).

అందునుబట్టి, పాదములు కడగడమనేది ఆతిథ్యానికిని పరిచర్యకును సంబంధించినదే గాని ఆరాధనలో భక్తి సంబంధమైన కార్యాకలాపాలకో సంబంధించినది కాదు. సంఘ ఆరాధనలో అనుసరించవలసిన మాదిరిని యేసు యిక్కడ పెట్టలేదు.

తన మాదిరిని అనుసరించుడని యేసు తన శిష్యులకు ఏ విధానంలో దీన్ని ఉద్దేశించారు? "నేను చేయుచున్నది ఇప్పుడు నీకు తెలియదుగాని యికమీదట తెలిసికొందువు" అని ఆయన పేతురుతో అన్నారు. ఈ సంభవంనుండి – పేతురు – మరియు తక్కినవారు – తరువాత ఏమి గ్రహించారు?

మొదట, పరిచారకులులా వారు వ్యవహరించాలని యేసు ఉద్దేశించినట్టు ఆయన శిష్యులు గ్రహించారు. పాదాలు సాధారణంగా బానిసలచే కడుగబడేవి. గనుక ఆ దాసుని స్థితికి యేసు తన్నుతాను తగ్గించుకున్నారు. (ఫిలిప్పీయులకు 2:4–7 చూడు.) దీన్ని

గూర్చి ఆలోచించు: ఈ విశ్వానికి సృష్టికర్త, మానవజాతికి రక్షకుడు, రాజులకు రాజును ప్రభువులకు ప్రభువును, తన శిష్యులకు బోధకుడును, యజమానియు ప్రభువునైనవాడు, గర్విష్టులైన తన శిష్యుల ఎదుట హీనమైన బానిసయైయున్నట్టు మోకరించాడు.

రెండవది, వారి సేవకు కొన్ని గుణలక్షణాలుండాలని యేసు ఉద్దేశించినట్టు వారు గ్రహించియుండవచ్చు. *ఏది అవసరమో యేసు దాన్ని జరిగించాడు.* శిష్యుల పాదాలు మురికిగా ఉన్నాయి, ఆయన వాటిని కడిగారు. ఆ సమయపు అవసరతను ఆయన తీర్చారు. *ఆ అవసరత తీర్చడానికిగాను, బహు హీనమైన, మురికి రకమైన పనిని యేసు చేశారు.* కాళ్లుకడగడంకంటె తక్కువగా ఉండే అనేక పనులను గూర్చి నేను ఆలోచింపలేను. త్వరలో తననుండి తిరిగిపోయే వారికి సయితం యేసు పరిచర్య చేశారు. తన శిష్యులలో ప్రతి ఒక్కని పాదాలు కడగాలని యేసు పట్టుపట్టారు. *అందులో త్వరలోనే ఆయనను ఎరుగనని* చెప్పబోయే పేతురు కూడా ఉన్నాడు. అందులో ఆయన మరణాన్ని తెచ్చేలా తన్ను అప్పగింపనైయున్న యూదా కూడా ఉన్నాడు. “ఆయనను విడిచి పారిపోయిన” (మార్కు 14:50) మిగిలిన తన శిష్యుల బృందం కూడ చేర్చబడ్డారు.

మూడవది, దేవుని రాజ్యములో మిక్కిలి గొప్పవాడు వినయముగలిగి పరిచర్య చేయడమే మార్గమని - ఎట్టకేలకు - వారు అర్థం చేసికొనియుండాలి. యేసు భూసంబంధమైన రాజ్యం స్థాపించుతారనే ఎదురుచూపు వలన వారలాటి గొప్పతనం కొరకు ప్రాకులాడియుండవచ్చు. భూసంబంధమైన రాజ్యంలో, “అన్యజనములలో రాజులు వారిమీద ప్రభుత్వముచేయుదురు; ... మీరైతే ఆలాగు ఉండకూడదు” అని ప్రభువైన యేసు అన్నారు (లూకా 22:25, 26). మార్కు యిలా రాస్తున్నాడు:

> యేసు వారిని తనయొద్దకు పిలిచి వారితో ఇట్లనెను – అన్యజనులలో అధికారులని యెంచబడినవారు వారిమీద ప్రభుత్వము చేయుదురు; వారిలో గొప్పవారు వారిమీద అధికారము చేయుదురని మాకు తెలియును. మీలో అలాగుండకూడదు. మీలో ఎవడైనను గొప్పవాడైయుండగోరిన యెడల వాడు మీకు పరిచారము చేయువాడై యుండవలెను. మీలో ఎవడైనను ప్రముఖుడై యుండగోరినయెడల, వాడు అందరికి దాసుడైయుండవలెను. మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెననెను (మార్కు 10:42-45).

క్రైస్తవ్యంలో పైకి వెళ్లే మార్గము క్రిందికి దిగడమే! తన్నుతాను తగ్గించుకొని పరిచారకుడుగా మారడానికి యిష్టపడినవాడే దేవుని రాజ్యములో మిక్కిలి గొప్పవాడుగా ఎంచబడును.

మనుష్యరీతిగా మాట్లాడుతున్నా: మన దినాల్లో ప్రభువు సంఘమందు ఎవడు గొప్పవాడై పరలోకమందున్న దేవుడు గుర్తించడమైతే, ఆ వ్యక్తి ఎవరైయుంటారు? వేలకొలది మందికి బాప్తిస్మమిచ్చిన గొప్ప సువార్తికుడైయుండ నవసరమా? సత్యాన్ని ఉపదేశించడానికి అనేక రచనలు వ్రాసిన గొప్ప రచయితా? రేడియో లేక టెలివిజన్ స్పికరా? వాగ్వవాదం చేయగలవాడా? అద్భుతంగా పాటలు నడిపించేవాడా?

సహోదరత్వంలోనే అతి పెద్ద సంఘంలోని పెద్దయా? ఎక్కువ తరచుగా సహోదరత్వపు ప్రచురణలలో ప్రముఖ్యుడైయుండువాడా? రాజ్యములో "మిక్కిలిగొప్పవాడు"గా ప్రభువు ఎవరిని ప్రకటింపవచ్చు? అయితే వీరిలో యెవరే కాకుండ – తన సహోదరత్వంలోను, తాను హాజరయ్యే స్థానిక సంఘంలోను తప్ప తన్ను గూర్చి ఎవరును ఎన్నడే వినని ఒక విధవరాలు కావచ్చు – ఆమె జీవించుతూ యితరులకు పరిచర్య చేస్తున్నట్టు వారికి తెలుసు, మరియు ప్రభువునకు తెలుసు: ఆమె కుటుంబం, ఆమె స్నేహితులు, ఆమె పొరుగువారు, క్రీస్తునందు సహోదరులు మరియు సంఘము – అటు ఆమె హాజరయ్యే స్థానిక సంఘము – లోకంలో ఉన్న సంఘం ఆమె సత్కార్యములయందు ధనికురాలు, యితరులకు పరిచర్య చేయడంవలన ఆమె క్రీస్తును సేవించుతుంది.

తన శిష్యులు పరిచారకులై యితరులకు సేవచేయడంవలన మాత్రమే పరలోక రాజ్యమందు గొప్పవారుగా ఎంచబడుదురనే విషయం గ్రహించునట్టు క్రీస్తు యొక్క మాదిరి అవసరం.

## యేసువారి మాదిరి మననుండి ఏమి కోరుతుంది?

ప్రాథమికంగా, ఆయన తన అపొస్తలులనుండి ఏమికోరారో, దానినే ప్రభువు మనయొద్దనుండి కూడా కోరుతున్నారు. అపొస్తలుల స్థానంలో నిన్ను నీవు పెట్టుకొని చూడు; యేసు వారికి ఏమి చెప్పారో [ఈ విషయంలో] ఆయన నీకు అదే చెప్పుతున్నారు: "మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే. నేను ... చేసిన ప్రకారము మీరను చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని ... గనుక వాటిని చేసినయెడల మీరు ధన్యులగుదురు." ఇతరులకు సేవ చేయడం వలన, వారి అవసరత ఎట్టిదైనా వారికి పరిచర్య చేయడంవలన పరిచర్య చేయడానికి అవసరమయ్యింది ఏదో దాన్ని చేస్తూ ఉండాలి. అవిశ్వాసుల లోకంలోని అధికారపు చెలామణి దేవుని రాజ్యంలో ఉండదని, దేవుని రాజ్యంలో గొప్పతనం తగ్గింపుతో కూడిన పరిచర్యలో ఉందని తెలిసి అలా జరిగించాలి.

యేసువారి మాదిరిని మనం ఎలా వెంటాడవచ్చు? పరిచర్య చేయనుద్దేశించితే మనం ఏమి చేయవచ్చు? ఒక విషయమేమంటే, హీనమైన పనులు, మురికి పనులు చేయడానికి మనం యిష్టపడాలి. ఇతరులకు, గర్విష్టులకైనా, మన శత్రువులకైనా, మనలను నిరాశపరచే మన స్నేహితులకైనా సేవచేయడానికి మనం సిద్ధంగా ఉండాలి. మనం తక్కువవారిగా కనిపించే స్థితిలో సహితము ఇతరులకు సేవచేయడానికి మనలను మనము తగ్గించుకోవాలి. అవసరమైతే, నెమ్మదిగా, ఆర్భాటం చేయకుండ, గుర్తింపు కోరకుండ మనం సేవచేస్తాం. మనం సంఘానికి సహాయపడతాం, సహోదరులకు సహాయం చేస్తాం, కేవలం మనం క్రైస్తవులం గనుక యితరులకు సహాయం చేస్తాం, పరిచర్య చేయడంలో తన రక్షకుని మాదిరిని వెంటాడడం క్రైస్తవుని స్వభావమైయుంది.

ఖచ్చితంగా అలా పరిచర్య చేసే జనులనుబట్టి నేను దేవునికి స్తుతి చెల్లిస్తాను. సందర్శించేవాడు వారిని ఎన్నడే చూడక పోవచ్చు లేదా వారు ఏమి చేస్తారో ఎరుగకపోవచ్చు, కాని వారు పరిచర్య చేస్తారు. హాజరుకాని సభ్యులను పిలిచి, వారిని

తాము కలిసికోలేకపోయామని పలుకరిస్తారు. కొందరు సంఘానికి రాతపనులు చేస్తారు. కొందరు చర్చ్ బిల్డింగ్‌ను శుద్ధం చేస్తారు, లేక పాటలు పుస్తకాలను ఎత్తి తిరిగి వాటి స్థానంలో పెడతారు. బిల్డింగ్ వెలుపల మెయిన్‌టెనెన్స్ పని కొందరు చేస్తారు. సంఘ ప్రకటన పత్రికను కొందరు కలసి పనిచేసి పెడతారు, కొందరు సంఘ నాయకులు యితరులను దర్శించుతూ సంఘపు పనిని చర్చించుతూ ఉంటారు. కొందరు బైబిలు ప్రోగ్రామును నడిపించుతూ లేక ఉపదేశం చేస్తుంటారు. కొందరు ప్రభు రాత్రి భోజన ఏర్పాట్లను సిద్ధం చేస్తారు. ఏదో ఒక విధంగా కొందరు దిక్కులేని పిల్లలకు సహాయపడతారు. కొందరు పసి పిల్లలను జాగ్రత్త తీసికొంటారు. అవసరతలో ఉన్నవారికి లేక చనిపోయినవారి యింటికి భోజనాలను తెస్తారు. కొందరు రోగులను, సొంతవారిని పోగొట్టుకున్న యిండ్లను దర్శిస్తారు. కొందరు యితరులను తమ యింటికి ఆహ్వానించి ఉపదేశించి విశ్వాసమందు వారిని బలపరచుతారు లేక ప్రభువు వారిని మార్చుతారు. కొందరు కేవలం యితరులను గమనించి వారి అవసరతలు తీర్చ ప్రయత్నిస్తారు లేక వారితో దయగా మాట్లాడి వారిని ప్రోత్సహిస్తారు.

వారి మాదిరిని నేను సిఫారసు చేస్తున్నాను: వెళ్లి నీవును ఆలాగున జరిగించు.

## ముగింపు

గొప్పతనానికి మార్గం పరిచర్య [సేవ] చేయడంగా కేవలం గుర్తించినట్టయితే సంఘంలోను ప్రపంచంలోను ఉన్న అతి పెద్ద సమస్యలు పరిష్కరింపబడవచ్చు. "మహా ఘనమైనదిగా ఏది తెలియబడుతుంది?" ఎవరు దానికి ఇన్‌చార్జిగా ఉండబోతారు? ఘనత, గుర్తింపు ఎవరికి రాబోతుంది? అనే సంబంధిత ప్రశ్నల వలన దాదాపుగా ఎల్లప్పుడు మహా గొప్ప సమస్యలు ఏర్పడతాయి. ఈ విధానంలో లోకంలో వలె ఉండాలనే శోధనను మనం ప్రతిఘటించినట్టయితే, సంఘర్షణలు తల ఎత్తకముందే పరిష్కరించబడతాయి.

క్రైస్తవ్యానికి గురుతు [సింబల్] ఏమైయుండాలి? పశువులకు కుడితి పెట్టు తొట్టియా? సిలువా? కిరీటమా? తువాలు సంగతి ఏమి? మన రక్షకుడు మోకరిల్లి, శిష్యులు పాదాలను కడగడం చూచిన తరువాత, ఒకరికొకరును, సమస్త మానవాళికి మనమందరం సేవచేయాలనేది నా సలహా. తువాలును నడుమునకు కట్టుకొని ఆయన [నీ] తన శిష్యుల పాదాలు కడగడానికి యిష్టపడినట్టయితే, యితరులకు సేవచేయు నీ తువ్వాలును ధరించుకొనలేని నీవు గర్వంగా ఎందుకుంటావు?

నీవు పరిచర్య చేయడానికి యిష్టపడతావా? క్రీస్తు యొక్క శిష్యుడుగా మారి, సంఘంలోను సంఘం ద్వారాను యితరులకు సేవచేయి.